ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

శుక్రవారం 12 జనవరి 2024





'హద్దు'లేని భూ ఆక్రమణలు 7

తెలంగాణ అటవీ భూముల్లో కర్ణాటక రైతుల కబ్జాలు



ఇక రెండే జిల్లాలా?

జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మరోసారి చర్చమొదలైంది. అస్తవ్యస్తంగా ఉన్న కొత్త జిల్లాలపై కమిషన్ వేయాలని కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. కాలయాపన చేయకుండా కమిషన్ ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను తీసుకుని ఆరునెలల్లో నివేదిక వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొంటుంది. దీన్ని బట్టి చూస్తే జిల్లాల పునర్ వ్యవస్థీకరణే కాకుండా రెవెన్యూ డివిజన్లు, మండలాల్లో మార్పులు, చేర్పులు జరిగే అవకాశం మెండుగా కన్పిస్తున్నాయి. శాస్త్రీయ విధానాలతో జిల్లాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

- పార్లమెంట్ పరిధిలో ఒక జిల్లా ప్రతిపాదన!
- శాస్త్రీయంగా డివిజన్లు, మండలాలు
- ఇప్పటికే రంగారెడ్డి కలెక్టరేట్‌పై తీవ్ర వ్యతిరేకత
- రవాణా సౌకర్యం లేక ఉద్యోగులు, ప్రజల అవస్థలు

జిల్లాల విభజనపై కమిషన్ ఏర్పాటుకు సర్కారు కసరత్తు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ప్రస్తుతం ఉన్న జిల్లాల పరిధిపై కమిషన్ వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మరోసారి చర్చమొదలైంది. గతంలో ఉమ్మడి రంగారెడ్డిజిల్లాను మూడు భాగాలుగా విభజించి రంగారెడ్డిజిల్లాతో పాటు కొత్తగా వికారాబాద్, మేడ్చల్ జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే కొత్తగా అస్తవ్యస్తంగా ఉన్న కొత్త జిల్లాలపై కమిషన్ వేయాలని ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' ఏండీ వేమూరి రాధాకృష్ణ నిర్వహించిన బిగ్‌డిబేట్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలపై సుప్రీం కోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిషన్ వేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కమిషన్‌లో రెవెన్యూ రిటైర్డ్ అధికారులు కూడా ఉంటారని తెలిపారు. కాలయాపన చేయకుండా కమిషన్ ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను తీసుకుని ఆరునెలల్లో నివేదిక వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెవెన్యూ, పోలీసు, ఇతర వ్యవస్థలన్నీ ఒకే చట్రంలో పనిచేసే వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఉదాహరణకు ఒక పోలీస్ స్టేషన్ పరిధి ఒకే అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉండే విధంగా చర్యలు తీసుకుంటారు. అలాగే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఒక డీఎస్పీ , ఇతర వ్యవస్థలు ఉండే విధంగా శాస్త్రీయ పద్ధతిలో పునర్ వ్యవస్థీకరణ చేయనున్నారు. దీన్ని బట్టి జిల్లాల పునర్ వ్యవస్థీకరణే కాకుండా రెవెన్యూ డివిజన్లు, మండలాల్లో మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉంది.



ఒక జిల్లాకు రెండు ప్రాంతాల పేర్లు

ఏదైనా జిల్లాకు ఓ ప్రముఖ ప్రాంతం పేరు పెట్టడం ఆనవాయితీ. కానీ రెండు ప్రాంతాల పేరుతో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాను ఏర్పాటు చేశారు. వాస్తవానికి ఈ రెండు కూడా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలు కావడం గమనార్హం. ఇలా ఎందుకు రెండు ప్రాంతాల పేర్లు పెట్టారో కూడా ఎవరికీ అర్థం కాదు. విచిత్రమేమిటంటే జిల్లా పేరు ఉన్న మేడ్చల్‌లో కానీ మల్కాజిగిరిలో కానీ కలెక్టరేట్ నిర్మాణం చేయలేదు. శామీర్‌పేట సమీపంలో కలెక్టరేట్ నిర్మించారు. మరో విచిత్రమేమిటంటే మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా పరిషత్‌లో సభ్యులు సంఖ్య కేవలం ఐదు మాత్రమే. జడ్పీ చైర్మన్, వైస్‌చైర్మన్ పోనూ ఇద్దరు సభ్యులే ఉంటారు. ఇద్దరు జడ్పీటీసీల మద్దతు ఉంటే చాలు జడ్పీ చైర్మన్ అయిపోవచ్చు. ఇలాంటి పరిస్థితి దేశంలోనే ఎక్కడా ఉండకపోవొచ్చు. ఇందువల్లే శాస్త్రీయ విధానాలతో జిల్లాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

పార్లమెంట్ పరిధిలో జిల్లా!



రంగారెడ్డి కలెక్టరేట్

కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ పరిధిలో ఒక జిల్లాను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న కొత్త జిల్లాలపై ప్రజల్లో కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. జిల్లాల విభజనతో పాటు జిల్లా కేంద్రాల విషయంలో కూడా మెజార్టీ ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా నిర్ణయాలు తీసుకున్నారు. ఒక సమయంలో హైదరాబాద్ పక్కనే ఉన్న చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గాన్ని వికారాబాద్ జిల్లాలో కలిపారు. దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో చివరకు మళ్లీ రంగారెడ్డిజిల్లాలోనే ఉంచారు. తాజాగా ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేయాలని నిర్ణయించడంతో కొత్త జిల్లాలను ఎలా మదింపు చేస్తారనే చర్చ మొదలైంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఒక పార్లమెంట్ పరిధిలో ఒక జిల్లాను ఏర్పాటు చేయాలని కొత్త ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. దీనికి అనుగుణంగా రెవెన్యూ డివిజన్లు, మండలాల్లో మార్పులు, చేర్పులు చేయనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు అనుగుణంగా ఉండాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ అనంతరం చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో రెండు జిల్లాలు ఉండే అవకాశం ఉంది. ఇటీవల పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పరిగి మండల పరిషత్ సర్వసభ్యసమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో ఒక జిల్లా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచిస్తున్నట్లు తెలిపారు.

రవాణా సౌకర్యం అంతంతే..

అయితే ఇప్పటికీ రావిర్యాలలో ఏర్పాటు చేసిన రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేదు. ఉద్యోగుల కోసం ఉదయం., సాయంత్రం మాత్రం రెండేసి బస్సులు నడుపుతున్నారు. సాధారణ వ్యక్తులు అక్కడికి చేరుకోవాలంటే నానా ఇబ్బందులు పడాల్సిందే. కనీసం రూ.వేయి ఖర్చు కావాల్సిందే. ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో లక్డీకాపూల్‌లో ఉండే ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ ఇంతకంటే అందరికీ సౌకర్యంగా ఉండేది. ముందు బస్టాప్, వెనుక రైల్వే స్టేషన్ ఉండడంతో సుదూరం నుంచి కూడా ఎలాంటి ప్రయాస లేకుండా ఇక్కడకు చేరుకునేవారు. ఇప్పుడు అక్కడకు సామాన్యులు వెళ్లాంటే క్యాబ్‌లు, ఆటోలే దిక్కు. ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వీరికి 28శాతం హెచ్‌ఆర్‌ఏ ఉండేది. ఇప్పుడు కేవలం 11శాతమే హెచ్‌ఆర్‌ఏ ఇస్తున్నారు. దీంతో జీతం రూ.10 నుంచి 15వేల వరకు తగ్గిపోవడంతో ఉద్యోగులంతా లబోదిబోమంటున్నారు. రావిర్యాలలో ఉండే అవకాశం లేకపోవడంతో నగరం నుంచి అందరూ రాకపోకలు సాగిస్తున్నారు. రవాణా ఖర్చులు తడిసిమోపెడు వుతున్నాయి. ఇక మేడ్చల్- మల్కాజిగిరి కలెక్టరేట్ కొంత ఫర్వాలేదు. కానీ ఇక్కడకు కూడా వెళ్లేందుకు కూడా నేరుగా బస్సు సర్వీసులు లేవు.

మెజార్టీ అభిప్రాయాన్ని కాదని కలెక్టరేట్లు

ముఖ్యంగా రంగారెడ్డిజిల్లా విభజన తరువాత కొత్తగా ఏర్పాటైన జిల్లాల కలెక్టరేట్ల నిర్మాణాల విషయంలో అప్పటి ప్రభుత్వం ఇష్టారాజ్యంగానే వ్యవహరించింది. అధికారులు, స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు అభిప్రాయాలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నారు. అప్పట్లో రంగారెడ్డి కలెక్టరేట్ ఏర్పాటుకు పలు చోట్ల స్థల పరిశీలన జరిపారు. ఇందులో రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీతో పాటు అప్పా జంక్షన్ వద్ద కొత్త కలెక్టరేట్ ఏర్పాటు చేయాలని మెజార్టీ ఎమ్మెల్యేలు., ప్రజా ప్రతినిధులు కోరారు. కానీ దీనికి విరుద్ధంగా రావిర్యాలలో కలెక్టరేట్ నిర్మాణం చేపట్టారు. దీనిపై అప్పట్లో ఎమ్మెల్యేలు ఈ విషయంపై కేసీఆర్‌ను కలవడానికి ప్రయత్నించినా అవకాశం దక్కలేదు. చకచక నిర్ణయాలు తీసేసుకున్నారు.

ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రసాద్‌కుమార్



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు

వికారాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేలా కృషిచేస్తానని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం మద్గుల్ చిట్టంపల్లిలోని డీపీఆర్‌సీలో చైర్‌పర్సన్ సునీతారెడ్డి అధ్యక్షతన జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి, స్పీకర్ వికారాబాద్ జిల్లా వారే కావడంతో ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజావసరాలను గుర్తించడం, అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని, వారు సమన్వయంతో పనిచేయాలన్నారు. గత ప్రభుత్వంలో 'మన ఊరు-మన బడి' పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ఎస్‌ఎంసీలు, సర్పంచ్‌లు, కాంట్రాక్టర్ల కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు, ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేస్తామని స్పీకర్ స్పష్టం చేశారు. చేవెళ్ల-ప్రాణహిత-పాలమూరు ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు, తాగునీరు అందిస్తామన్నారు. రూ.200కోట్లతో అనంతగిరి కొండలను ఎకో టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కోట్‌పల్లి, జుంటుపల్లి, సర్పన్‌పల్లి, ఇతర ప్రాజెక్టులను అభివృద్ధి సాగు నీరందిస్తూ పర్యాటకంతోనూ ఉపాధి కల్పిస్తామన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్‌తో హైదరాబాద్ నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగిందని తెలిపారు. జడ్పీ భవన నిర్మాణానికి సీఎంతో మాట్లాడి నిధులను మంజూరు చేసేలా కృషిచేస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు.

నా కాన్వాయ్ వచ్చే సమయంలో ట్రాఫిక్ ఆంక్షలొద్దు : స్పీకర్

మర్పల్లి: తన కాన్వాయ్ వచ్చే సమయంలో ట్రాఫిక్‌ను నియంత్రించి ప్రజలను, వాహనదారులను ఇబ్బంది పెట్టొద్దని స్పీకర్ ప్రసాద్‌కుమార్ పోలీసులను ఆదేశించారు. మర్పల్లి మండలం పంచలింగాలలో విలేకరులతో ఆయన మాట్లాడారు. తాను ప్రజల మనిషినని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతోందన్నారు. ప్రజలకు సేవ చేసేందుకే ఉన్న తమ నుంచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్నారు. తాను వాహనంలో ప్రయాణించే సమయంలో పోలీసులు సాధారణ ట్రాఫిక్‌ను మళ్లించి, నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని సూచించారు. తమ నుంచి ప్రజలకు ఇబ్బందులు కలగొద్దని, అందుకే ట్రాఫిక్ ఆంక్షలు విధించొద్దని ఆయన స్పష్టం చేశారు.

పలు సమస్యలు లేవనెత్తిన ప్రజాప్రతినిధులు

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని దౌల్తాబాద్ జడ్పీటీసీ డిమాండ్ చేశారు. బియ్యాన్ని కర్ణాటక, మహారాష్ట్రలకు అమ్ముకున్నారన్నారు. మిల్లర్ల అక్రమాలపై తన వద్ద ఉన్న ఆధారాలతో సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తానన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి స్పందిస్తూ.. జిల్లాలో షార్ట్‌ఫాల్ లేదని, రాష్ట్ర అధికారుల బృందం తనిఖీల్లోనూ గుర్తించలేదన్నారు. బషీరాబాద్ మండల శివార్లు, పక్కనే ఉన్న కొడంగల్ నియోజకవర్గ శివార్లలో 2వేల ఎకరాల వరకు తెలంగాణ అటవీ భూముల్లో కర్ణాటక రైతులు ఆక్రమించారని బషీరాబాద్ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్ కర్ణాటకలోని కలబురిగి కలెక్టర్‌తో చర్చించాలని కోరారు. యాలాల్‌లో డీసీఎంఎస్ దుకాణానికి ఎరువులు ఎందుకు సరఫరా చేయడం లేదని డీఏవో గోపాల్‌ను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో విద్యుత్ ఇనుప స్తంభాలను ఎందుకు తొలగించడం లేదని విద్యుత్ ఎస్‌ఈ జయరాజ్‌ను ప్రశ్నించారు. దోమ మండలం రాపోల్, బ్రాహ్మణపల్లి తండా సర్పంచుల నుంచి ఎంబీ బుక్‌లు తీసుకుని నెలన్నర గడిచినా ఇంకా ఇవ్వడం లేదని జడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. వారు తప్పు చేస్తే సస్పెండ్ చేయించాలి గానీ ఇతరులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. కలెక్టర్ స్పందిస్తూ ఎంబీలు, చెక్‌బుక్‌లు అధికారుల దగ్గర పెట్టుకుంటే చెల్లింపులు, పనులు నిలిచిపోతాయని, ఈ నెల 31వ తేదీలోగా పనులన్నింటికీ ఎంబీ రికార్డు చేయాలని డీపీవో తరుణ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈలు, డిప్యూటీ ఈఈలను ఆదేశించారు. మన ఊరు-మన బడి బిల్లులు ఇవ్వడం లేదని దోమ జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. ఎంబీ రికార్డు చేయాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం నిధులు లేకున్నా మన ఊరు-మన బడి పనులు చేయించిందని, అందుకే ఏడాదిగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనని తాండూరు ఎమ్మెల్యే అన్నారు. ఏఈలు కరెంట్ స్తంభాలు అమ్ముకుంటున్నారని దౌల్తాబాద్ జడ్పీటీసీ తెలిపారు. ధారూరు, పరిగి, మర్పల్లి జడ్పీటీసీలు సుజాత, హరిప్రియ, మధుకర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో కిందికి వేలాడుతున్న వైర్లను సరిచేయడం లేదని, ట్రాన్స్‌ఫార్మర్లకు ఏబీస్విచ్‌లు బిగించడం లేదన్నారు. వెంటనే పరిష్కరించాలని స్పీకర్ ఆదేశించారు. జడ్పీ వైస్‌చైర్మన్ విజయ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ పనులకు రూ.10కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉందని, చెల్లించి ఆదుకోవాలని కోరారు. మర్పల్లి జడ్పీటీసీ మధుకర్ మాట్లాడుతూ.. కొంశెట్‌పల్లి ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్‌లో తుమ్మలపల్లిలో పదెకరాలు ఆక్రమణకు గురైందని, తుమ్మలపల్లిలో 500ఎకరాల్లో ఫాంల్యాండ్ ఏర్పాటు చేస్తున్నారని, రోడ్డును ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బషీరాబాద్ మండలంలో కర్ణాటక 'షేర్' మూల అనే ఫైనాన్షియర్లు మహిళలకు ఎక్కు వ వడ్డీకి రుణాలిస్తూ మోసగిస్తున్నారని ఎంపీపీ కరుణ తెలిపారు. ఎక్కువ వడ్డీకి రుణాలిచ్చే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు..

స్పీకర్, ఎమ్మెల్యేలకు ఘన సన్మానం

జడ్పీ సమావేశానికి తొలిసారి హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. సమావేశానంతరం స్పీకర్, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలను జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, అదనపు కలెక్టర్, సీఈవో, జడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు శాలువాలు,పుష్పగుచ్ఛాలతో సన్మా నించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శ ర్మ, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డిప్యూటీ సీఈవో సుభాషిణి, జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు కోటాజీ, రాష్ట్ర ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడు సత్తయ్య, జిల్లా అధ్యక్షుడు శేషగిరిశర్మ పాల్గొన్నారు.

జిల్లాకు మంచి రోజులొచ్చాయి : జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

మన జిల్లాకు మంచి రోజులు వచ్చాయని, పార్టీలు ఏవైనా సరే మన జిల్లా నుంచి స్పీకర్, సీఎం ప్రాతినిధ్యం వహించడం జిల్లా ప్రజల అదృష్టమని, ఇందుకు తనకు సంతోషంగా ఉందని జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ముందుకు సాగుదామని, ఆ దిశగా అందరూ కృషిచేయాలని అన్నారు. జిల్లాలో భూ సమస్యలు, ఇతర ప్రజాసమస్యలున్నాయని, వాటి పరిష్కారానికి రెవెన్యూ అధికారులు కృషిచేయాలని సూచించారు. పాలమూరు ఎత్తిపోతల ద్వారా జిల్లాకు త్వరగా నీరు తెచ్చి ఉభయ గోదావరి జిల్లాల మాదిరిగా పంటలతో కళకళలాడేలా తీర్చిదిద్దాలని కోరారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా నుంచి ఇసుక తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఇసుక కొరతతో జల్లాలో ప్రభుత్వ పనులు నిలిచిపోయాయని, ఇసుక కేటాయించి పనులు సాగేలా చూడాలని సునీతారెడ్డి సూచించారు.

- ఇప్పటి వరకు ఎలక్షన్ ప్రక్రియే చేపట్టని ప్రభుత్వం
- లోక్‌సభ ఎన్నికల తర్వాతే పంచాయతీ పోరు
- ఫిబ్రవరి 2తో ముగియనున్న ప్రస్తుత పాలకవర్గాల గడువు
- ఎన్నికలదాకా ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలు

పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన?

ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశం



మేడ్చల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రస్తుత సర్పంచ్‌ల పదవీకాలం ఫిబ్రవరి 2తో ముగియనుంది. అయితే ఇప్పటి వరకు పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాన్న ప్రకటింలేదు. రానున్న మూన్నాలుగు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు ఉండడం, పాత ప్రభుత్వం పోయి నూతన ప్రభుత్వం ఏర్పాటు తదితర కారణాలతో ఇప్పట్లో పంచాయతీ ఎన్నికలు లేనట్లే అన్పిస్తోంది. ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు, త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికలపై దృష్టిసారించడంతో గ్రామ పంచాయతీ ఎన్నికలపై ఆసక్తి చూపడం లేదు. ఎన్నికలు జరగాలంటే కనీసం నెల రోజుల ముందు కసరత్తు ప్రారంభించాలి. అంటే ఇప్పటి వరకే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలి. అయితే ప్రభుత్వం ఈ వైపుగా ఎలాంటి ప్రక్రియ చేపట్టలేదు. దీన్నిబట్టి చూస్తే లోక్‌సభ ఎన్నికల తర్వాతే పంచాయతీ ఎన్నికలుండే అవకాశం ఉంది. గడువు ప్రకారమే ఎన్నికలు పెట్టాల్సి ఉంటే జనవరి మొదటి వారం నుంచే ఎన్నికల నోటిఫికేషన్, షెడ్యూల్ ప్రకటించాలి. పంచాయతీల గడువు మరో 20రోజులే ఉండటంతో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో జరగవని, పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన అమలయ్యే అవకాశం ఉందని అధికారులు, సర్పంచ్‌లు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నికల ప్రక్రియ ప్రకటించని రాష్ట్ర సర్కార్

పార్టీ రహితంగా నిర్వహించే పంచాయతీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించే గుర్తులతో బ్యాలెట్ పేపర్లను ఉపయోగించి నిర్వహిస్తారు. ఎన్నికలకు భారీగా బ్యాలెట్ బాక్సులు అవసరం. అందుకు సన్నద్ధం కావాలంటే కనీసం నెలన్నర రోజుల ముందే ప్రక్రియ చేపట్టాలి. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ జాబితా కాకుండా గ్రామపంచాయతీ, వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను సైతం ప్రకటించాలి. మేడ్చల్ జిల్లాలో 61 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఇంటింటి సర్వే చేస్తారు. వారం రోజుల్లో అర్హులను గుర్తించి గ్యారంటీలను అమలు చేయాలనే యోచనలో పాలకులు ఉన్నారు. ఈ నెల మొత్తం ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన, గ్యారంటీల అమలు తదితర పనుల్లో నిమగ్నమవుతారు. దీనితో పాటు త్వరలో జరిగే లోకసభ ఎన్నికలు ప్రధానమైనందున వాటిపై ఫోకస్ చేస్తారు. ఈ లెక్కన లోక్‌సభ ఎన్నికలు జరిగే ఏప్రిల్, మే చివరి వరకు పంచాయతీ ఎన్నికలకు అవకాశం కన్పించడం లేదు. ఏ లెక్కన చూసినా జూన్‌లో గ్రామ పంచాయతీల ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నాయి. అదేసమయంలో మండల పరిషత్ ఎన్నికలు కూడా రానున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీల ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగనుంది. ప్రస్తుతం ఉన్న పంచాయతీ కార్యదర్శి కార్యనిర్వహణాధికారిగా ఉంటారు. వారికి తోడుగా మండలస్థాయి ప్రత్యేకాధికారిని నియమిస్తారు. మండల పరిషత్ పరిధిలోని సూపరింటెండెంట్, ఎంపీఓ, ఏఈలు, వ్యవసాయాధికారులు, పశువైద్యాధికారులను ప్రత్యేకాధికారులుగా నియమిస్తారు. దీంతో గ్రామ పంచాయతీల్లో పాలన పూర్తిగా ప్రత్యేకాధికారుల పరిధిలోనే కొనసాగనుంది.

అయ్యప్ప సన్నిధి షెడ్ కూల్చివేతపై

అయ్యప్ప మాలధారుల ఆందోళన


మూడుచింతలపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మూడుచింతలపల్లి, జనవరి 11: అయ్యప్ప సన్నిధి షెడ్ కూల్చివేతపై అయ్యప్ప మాలదారులు నిరసనకు దిగారు. మూడుచింతలపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. మూడుచింతలపల్లి మండల కేంద్రంలో సర్వే నంబర్ 22లో అయ్యప్ప మాలాధారణ స్వాములు సన్నిధి కోసం చందాలు వేసుకుని షెడ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఆ సన్నిధి ప్రభుత్వ స్థలంలో ఉందని రెవెన్యూ అధికారులు గతంలో అభ్యంతరాలు తెలిపారు. అయితే కాగా అయ్యప్ప మాలాధారణ సమయం కావడంతో స్వాములు సన్నిధిని ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు షెడ్‌ను అక్రమ కట్టడంగా గుర్తించి కూల్చివేశారు. దీంతో అయ్యప్ప మాలాధారరులు సన్నిధి కోసం మాత్రమే తాత్కాలికంగా షెడ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. రెవెన్యూ అధికారులు సహకరించాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ వాణిరెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వభూమిలో ఎలాంటి కబ్జాలు, నిర్మాణాలు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

'భగీరథ' ట్యాంక్‌ను పరిశీలించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


జినుగుర్తిలోని మిషన్‌భగీరథ ట్యాంకు

తాండూరు రూరల్, జనవరి 11: మండలంలోని జినుగుర్తి గ్రామంలో మిషన్ భగీరథ ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీటిని అధికారులు గురువారం పరిశీలించారు. ఆంధ్రజ్యోతిలో గురువారం 'వృథాగా పోతున్న తాగునీరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి మిషన్‌భగీరథ ఏఈ ప్రతిభ, ఎల్‌సీసీ సూపర్‌వైజర్ సూర్యనారాయణలు స్పందించారు. ట్యాంకు ఓవర్ ఫ్లో వల్ల నీరు వృథా అవుతున్నట్లు గుర్తించి సమస్యను పరిష్కరించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


పేదలకు దుప్పట్లు అందజేస్తున్న విద్యార్థులు

మేడ్చల్ టౌన్, జనవరి 11: కిష్టాపూర్ ఎంఆర్‌ఎం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గురువారం తమ అధ్యాపకులతో కలిసి పేదలకు దుప్పట్లు, బియ్యం, పప్పు ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పెరుగుతున్న చలితో ఫుట్‌పాత్‌లపై, ఆలయాల వద్ద, ప్రధాన కూడళ్ల వద్ద భిక్షాటన చేస్తూ జీవనం సాగించే పేదలకు విద్యార్థులు నిత్యావసరాలతో పాటు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రరత్నం, రెక్టార్ డాక్టర్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల వాటర్ ట్యాంక్‌లో పడి పిల్లి మృతి

● విచారణ చేపట్టిన విద్యాధికారి



ట్యాంక్‌లో పిల్లి కళేబరం, ఎంఈవోతో మాట్లాడుతున్న స్థానికులు

బషీరాబాద్, జనవరి 11: పాఠశాలలోని వాటర్ ట్యాంక్‌లో పిల్లి పడి మృతి చెందిన విషయమై బషీరాబాద్ ఎంఈవో పి.సుధాకర్‌రెడ్డి గురువారం విచారణ జరిపారు. బషీరాబాద్ రైల్వేస్టేషన్ కూడలిలోని సీపీఎస్ (కేంద్ర ప్రాథమిక పాఠశాల)లో మినీ వాటర్‌ట్యాంక్ నుంచి నీరు పడుతుండగా బుధవారం ఓ విద్యార్థి తండ్రి దుర్వాసన రావడానికి గమనించి అందులో చూడగా పిల్లి మృతి చెందడాన్ని గుర్తించారు. పిల్లిని తీయించిన హెచ్‌ఎం ఎండీ అబ్దుల్ ట్యాంక్‌ను వెంటనే శుభ్రం చేయించారు. అప్పటికే సమాచారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు కొందరు పాఠశాలకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ విషయమై విద్యాధికారి గురువారం పాఠశాలను సందర్శించారు. వాస్తవ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ ట్యాంక్ నీటిని వంటకు గానీ, తాగడానికి వాడటం లేదని స్పష్టం చేశారు. పిల్లి పక్క గోడపై నుంచి దూకి పడడంతో మృతిచెంది ఉండవచ్చని నిర్ధారణకు వచ్చారు. ప్రహరీ లేకపోవడంతో రాత్రివేళలో ఆకతాయిలు పాఠశాలలో మద్యం సేవిస్తున్నారని హెచ్‌ఎం విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు.

ఐటీసీటీ విభాగం అధికారులు చురుకుగా పనిచేయాలి:ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, జనవరి 11: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో పనిచేసే అధికారులు చురుకుగా, సమయస్ఫూర్తితో, ముందుచూపుతో పని చేయాలని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. జిల్లా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్ టీం అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో ఐటీసీటీ ముఖ్య విభాగం, పోలీస్ శాఖకు సంబంధించిన అన్ని రకాల ఆన్‌లైన్‌కి సంబంధించిన పని ఐటీసీటీ నుంచే జరుగుతుందన్నారు. పీఎస్‌లలో వర్టికల్ అధికారులకు ఆన్‌లైన్ మీటింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో సైబర్ క్రైం పైన వచ్చే ఫిర్యాదులపైన వెంటనే సైబర్ క్రైం పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ యు.రవీందర్‌రెడ్డి, ఐటీసీటీ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, ఎస్‌ఐలు శైలజ, రాధికలు, హెడ్ కానిస్టేబుల్ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచమంతా భారత్‌ను గొప్పగా చూస్తోంది

- మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 11: ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోందని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. వికాసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన వికారాబాద్ వచ్చిన ఆయన బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ దేశానికి 10వ స్థానం నుంచి 5వ స్థానానికి తీసుకొచ్చారని రానున్న రోజుల్లో మూడో స్థానంలో నిలుస్తుందన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా దేశంలోని 7లక్షల గ్రామాలకు కేంద్ర సంక్షేమ పథకాలు పోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ 10కి పైగా స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని చెప్పారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశమే లేదన్నారు. ఆ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. తమ కుటుంబం కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీలో తనకు టికెట్ వచ్చినా రాకున్నా పార్టీ కోసం పనిచేస్తానని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి ఓటు బ్యాంకు మూడింతలు పెరిగిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా ఎవరికి ఓటు వేసిన ఎంపీకి మాత్రం బీజేపీకి ఓటు వేసి గెలిపిస్తామని ప్రజలు చెబుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాండుగౌడ్, పరమేశ్వర్, మాధవి పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నను ఆదర్శంగా తీసుకోవాలి

- జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

రంగారెడ్డి అర్బన్, జనవరి 11 : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్నను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. వడ్డె ఓబన్న 208వ జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రేనాడు ప్రాంతంలో జన్మించిన ఓబన్న ఆనాడు బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జరిపిన సాయుధ పోరులో సైన్యాధ్యక్షుడిగా వీరోచిత పోరాటం చేశారని గుర్తుచేశారు. జిల్లా వడ్డెర సంఘం ప్రెసిడెంట్ డి.వెంకటరమణ, వడ్డెర సంఘం నాయకులు పందుగుల ఎల్లయ్య, దేవంగుల కృష్ణ, వరికుప్పల సుధాకర్, వరికుప్పల వెంకటేశ, వరికుప్పల శ్రీశైలం, పల్లపు వి.గణేష్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలి

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జనవరి 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సరిగ్గా పౌష్టికాహారం పంపిణీపై దృష్టిసారించాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్న కార్యక్రమాలు, డే కేర్ సెంటర్ల నిర్వహణ, సెక్టార్ల వారీగా వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, సంక్షేమాధికారి కృష్ణారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అధికారులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రానికి భూమి కేటాయించాలి

వికారాబాద్, జనవరి 11: వికారాబాద్ జిల్లాలో కొత్త కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని రాజేంద్రనగర్ హార్టికల్చర్ కాలేజ్ అసోసియేట్ డీన్ డాక్టర్ చీనానాయక్, హార్టికల్చర్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ కిరణ్ కుమార్‌తో పాటు జిల్లా ఉద్యాన శాఖ, పట్టుపరిశ్రమ శాఖ అధికారి చక్రపాణిలు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డిని గురువారం కలెక్టరేట్‌లో కలిసి విన్నవించారు. జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయానికి 50ఎకరాల భూమిని కేటాయించాలని వారు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 15కృషి విజ్ఞాన కేంద్రాల కేటాయించగా వికారాబాద్ జిల్లాలో ఏర్పాటవుతున్న తరుణంలో కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కొడంగల్ నియోజకవర్గంలో భూ కేటాయింపుజూకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లుగా వారు తెలిపారు.

ధ్యానం.. ప్రపంచశాంతికి దోహదం

నందిగామ, జనవరి 11: సంయుక్తంగా చేసే ధ్యానంతో ప్రపంచశాంతిని నెలకొల్పవచ్చని, అది శాస్త్రీయంగా ధ్రువీకరణ అయిందని మహర్షి వేదిక్ సంస్థ గురువు టోని నాడార్ అన్నారు. మండల పరిధి కన్హాశాంతివనంలోని ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యానమందిరంలో ఆధ్యాత్మిక సంస్థ మహర్షి వేదిక్ ఆధ్వర్యంలో ప్రపంచశాంతి కోసం 10 వేల మందితో 13 రోజులుగా ధ్యాన అసెంబ్లీని నిర్వహించారు. కార్యక్రమాన్ని గురువారం గ్లోబల్ యూనియన్ ఆఫ్ సైంటిస్ట్స్ ఫర్ పీస్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ధ్యానం చేయడంతో వ్యక్తిగత, ప్రపంచశాంతికి ఉపయోగపడేలా సాంకేతికంగా నిరూపితమయ్యిందని, న్యూరో సైంటిస్టులు, వైద్యులు ధ్రువీకరించారని టోని నాడార్ చెప్పారు. ప్రపంచశాంతిని సృష్టించడానికి స్పృహ ఆదారిత ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా కంచిపీఠాధిపతి విజయేంద్ర సరస్వతి కార్యక్రమంలో పాల్గొని ఆధ్యాత్మిక సందేశానిచ్చారు. కార్యక్రమానికి 139 దేశాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 11 వేల మంది పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మహర్షి వేదిక్ సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

'సోలార్'తో పశుగ్రాసం కటింగ్ మిషన్

- పరికరాన్ని కనిపెట్టిన ఎనిమిదో తరగతి విద్యార్థి

యాచారం, జనవరి 11 : చదివేది ఎనిమిదో తరగతే కానీ.. నవకల్పన చేశాడో విద్యార్థి. సోలార్‌తో పశుగ్రాసాన్ని కోసే పరికరరాన్ని కనుగొని అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రశంసలందుకున్నాడు. మండలంలోని కుర్మిద్ద ఉన్నత పాఠశాలకు చెందిన బైకని సాయిచరణ్ 8వ తరగతి చదువుతున్నాడు. పెట్రోల్, డీజిల్ సాయంతో నడిచే పరికరాలను పశుగ్రాసం కోసం ఉపయోగించడాన్ని చూసి అవేమీ లేకుండా నడిచే యంత్రాన్ని స్వతహాగా తయారు చేయాలని సాయిచరణ్ నిశ్చయించుకున్నాడు. సోలార్‌పవర్ విధానంతో తన పంట పొలంలో మొదట ప్రయోగం చేశాడు. అది విజయవంతం కావడంతో ఇటీవల జరిగిన సైన్స్‌ఫేర్‌లో సోలార్‌తో పశుగ్రాసం కోసే పరికరాన్ని ప్రయోగించి చూపడంతో అధికారులు ఆశ్చర్యపోయారు. కొత్త ఆలోచనలతో సరికొత్త పరికరాన్ని కనుగొన్న సాయిచరణ్‌ను డీఈవో సుశీందర్‌రావు అభినందించారు. గురువారం కుర్మిద్ద ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తుపాండురంగారెడ్డితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. పెట్రోల్, డీజిల్ వాడకంతో వాతావరణ పాడవుతుందని భావించి ఈ పరికరాన్ని కనుక్కున్నట్లు సాయిచరణ్ చెప్పారు.

కొనసాగుతున్న వైద్యశిబిరం

నందిగామ, జనవరి 11: కన్హా శాంతివనంలో కొన్ని రోజులుగా ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్న సందర్భంగా ఈ కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి సభ్యులు వస్తుండడంతో కోవిడ్ దృష్ట్యా ముందు జాగ్రత్తగా వైద్యాధికారులు వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. దగ్గు, జలుబు, జ్వరం ఉన్నవారికి కొవిడ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ స్రవంతి తెలిపారు. ఇప్పటివరకు ఏడుగురుకి కరోనా పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు.

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సులు

- సంక్రాంతిని పురస్కరించుకొని సొంతూళ్లకు తరలిన ప్రయాణికులు
- విద్యాలయాలకు సెలవులతో ఇంటిబాట పట్టిన విద్యార్థులు
- కిటకిటలాడిన చేవెళ్ల ఆర్టీసీ బస్టాండ్

చేవెళ్ల, జనవరి 11 : సంక్రాంతి సందర్భంగా చేవెళ్ల ఆర్టీసీ బస్‌స్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. పట్టణాల నుంచి ప్రజలు తమ సొంత గ్రామాలకు తరలివెళ్తుండటంతో పల్లెల్లో పండుగ వాతవారణం వచ్చేసింది. గురువారం చేవెళ్ల బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా మారింది. బస్సులన్నీ ప్రయాణికులతో నిండిపోయాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు భారీసంఖ్యలో బస్టాండ్‌లో కన్పించారు. చేవెళ్ల మీదుగా వికారాబాద్, పరిగి, తాండూర్, కొడంగల్, కోస్గి, షాద్‌నగర్, శంకర్‌పల్లి మీదుగా వెళ్లే బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి.


యాచారం : బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

కిక్కిరిసిన బస్సులు.. ప్రయాణికులు ఇక్కట్లు

యాచారం, జనవరి 11 : సంక్రాంతిని పురస్కరించుకొని విద్యాలయాలకు ప్రభుత్వం శుక్రవారం నుంచి సెలవులు ప్రకటించడంతో ఆర్టీసీ బస్సులు, ఆటోలు, క్రూయిజర్లలో ప్రయాణికులు కిక్కిరిసి వెళ్లారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు తమ గ్రామాలకు వెళ్లడానికి సామగ్రితో గమ్యస్థానాలకు చేరుకునేందుకు నానా తంటాలు పడ్డారు. గురువారం ఉదయం 11 గంటల నుంచే ఆర్టీసీ బస్సులు, ఆటోలు. క్రూయిజర్లలో సామర్థ్యానికి మించి ప్రయాణికులు తరలివెళ్లారు. దేవరకొండ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణికులు ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణించడం కనిపించింది. యాచారం మండలంలోని పలు హాస్టళ్లలో ఉండే విద్యార్థులు గురువారం సాయంత్రం తమ ఇళ్లకు తరలివెళ్లారు.

'హద్దు'లేని భూ ఆక్రమణలు

- తెలంగాణ అటవీ భూముల్లో కర్ణాటక రైతుల కబ్జాలు
- సీఎం సొంత జిల్లాలో వందల ఎకరాలు అన్యాక్రాంతం
- ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని రెండు రాష్ట్రాల అటవీ సరిహద్దు అంశం

బషీరాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కర్ణాటక సరిహద్దుల్లో ఆ రాష్ట్ర రైతులు తెలంగాణ అటవీ భూములను ఆక్రమించుకొని సాగుచేసుకుంటున్నారు. ఏటా ఈ భూముల్లో సాగును మన అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నా ఫలితం కన్పించడం లేదు. రెండు రాష్ట్రాల అటవీ భూమికి హద్దులు నిర్ణయించకపోవడంతోనే ఈ సమస్య చిక్కుముడిలా మారింది. కర్ణాటక ప్రాంత సమీప గ్రామాల రైతులు ఇది మా అటవీ భూమి అంటూ తెలంగాణ అడవుల్లోకి చొచ్చుకొస్తున్నారు. అటవీ శాఖ అధికారులు మా భూమిలోకి రావొద్దని కర్ణాటక రైతులను హెచ్చరిస్తుంటే.. కర్ణాటక ప్రభుత్వం ఇచ్చిన పట్టా పత్రాలను చూపిస్తూ గొడవలకు దిగుతున్నారు. ఈ క్రమంలో ఇక్కడి అధికారులు ఏం చేయలేక రెండు రాష్ట్రాల జాయింట్ సర్వే కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయడం, ఆ తర్వాత ఎవరూ స్పందికపోవడంతో సమస్య కొలిక్కి రావడం లేదు. వికారాబాద్ జిల్లా సీఎం సొంత జిల్లా కావడంతో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని రెండు రాష్ట్రాల అటవీ ప్రాంత సరిహద్దుల అంశం కొలిక్కివస్తుందని ప్రజాప్రతినిధులు, అటవీశాఖ అధికారులు ఆశిస్తున్నారు. తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండలం నీళ్లపల్లి-మైల్వార్ రిజర్వుడ్ అటవీ ప్రాంతమంతా సుమారు 2వేల ఎకరాల వరకు తెలంగాణ పరిధిలో ఉన్నట్లు అటవీ, రెవెన్యూ శాఖల అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఈ ప్రాంతంలో చెట్లను కర్ణాటక రైతులు నిరాటకంగా నరికివేసి అడవిని కబ్జా చేస్తున్నారు. ఇక్కడి అటవీ ప్రాంతం సర్వే నంబరు 20లో ఉన్న 679ఎకరాల్లో 200ఎకరాలకుపైగా చెట్లను నరికి సాగు చేసుకుంటున్నారు. అప్పట్లో రెండు రాష్ట్రాల అటవీ అధికారులు సరిహద్దులో కొంతమేర సర్వే చేసి 50ఎకరాల వరకు స్వాధీనం చేసుకొని మన రాష్ట్ర అధికారులు మొక్కలు నాటి పెంచుతున్నారు. మన రాష్ట్ర అటవీ భూములను కర్ణాటక రైతులు ఆక్రమించకుండా నీలగిరి, కానుగ మొక్కలను నాటుతున్నా రాత్రుల్లు రైతులు వాటిని నరికి పంటలు సాగు చేస్తున్నారు. అదీగాక ఆక్రమిత అటవీ భూమికి పక్క రాష్ట్ర ప్రభుత్వం పట్టా సర్టిఫికెట్లు ఇస్తుండడంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. ఇప్పటికే ఇస్మాయిల్ తండా వద్ద కర్ణాటక రైతుల నుంచి భూమి విడిపించిన మన అధికారులు మొక్కలు నాటారు. అయినా కర్ణాటక రైతుల కబ్జాలో వందల ఎకరాలు ఉందని అధికారులు చెబుతున్నారు. కర్ణాటకలోని బొందెంపల్లితండా, పలుగురాళ్లతండా, పెచ్చర్‌తండా తదితర తండాల రైతులు కబ్జా పర్వాన్ని కొనసాగిస్తున్నారు. కాగా నీళ్లపల్లి పంచాయతీలో 640ఎకరాల అటవీభూమి ఉంది. 1991లో 130ఎకరాలను మన ప్రభుత్వం స్వాధీనం చేసుకుని 50 మంది తెలంగాణ రైతులకు పట్టాలిచ్చింది. మిగిలిన భూమిని కర్ణాటక రైతులు కబ్జాచేసుకున్నారు.


కొళ్లాపూర్‌లో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు(ఫైల్)

కొత్లాపూర్‌లో ఆ 300 ఎకరాలు ఏ శాఖది?

కొత్లాపూర్ సమీపంలో సుమారు 300ఎకరాల భూమి ఉంది. ఈ భూమి రెవెన్యూశాఖదా? లేక అటవీ శాఖదా? అనేది తేలడం లేదు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదని గ్రామ సర్పంచ్ రవి చెబుతున్నారు. ఇటీవల బషీరాబాద్ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇకనైనా రెవెన్యూ, అటవీల శాఖ అధికారులు ఆ భూమి ఎవరిదో గుర్తించాలన్నారు. భూమి ఉన్నా ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, ఇతరత్రా ప్రజా అవసరాలకు వినియోగించుకోలేని దుస్థితి నెలకొందని సర్పంచ్ వాపోతున్నారు. కాగా నీళ్లపల్లి-మైల్వార్ ఫారెస్ట్‌లో సుమారు 1,600 నుంచి 2వేల ఎకరాల అటవీ భూముల్లో కర్ణాటక రైతులు సాగు చేసుకుంటున్నారని గురువారం నిర్వహించిన వికారాబాద్ జెడ్పీ సమావేశంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు బషీరాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ సైతం బషీరాబాద్ మండలానికి సరిహద్దుగా ఉందన్నారు. వారి మండలంలోనూ కొంత అటవీ భూమి కబ్జాకు గురైందన్నారు. కొత్లాపూర్‌లో 300 ఎకరాల ప్రభుత్వ భూమి అంశాన్నీ తేల్చాలని కోరాను. ఈ సమావేశానికి హాజరైన అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ నారాయణరెడ్డి స్పందించారు. అటవీ భూములపై రెండు రాష్ట్రాల అధికారులతో జాయింట్ సర్వే చేయిస్తామని చెప్పినట్లు జెడ్పీటీసీ తెలిపారు.

బల్దియా చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం!

- సొంతపార్టీ నేతల నిర్ణయం
- మాజీ ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

తాండూరు, జనవరి 11: బల్దియా చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. సొంత పార్టీ వారే అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించారు. ఇప్పటి అవిశ్వాసంపై కలెక్టర్‌కు మెజార్టీ కౌన్సిలర్లు సంతకాలతో కూడి విన్నవించారు. చైర్‌పర్సన్ స్వప్న కోర్టును ఆశ్రయించడంతో అవిశ్వాసం అంశం పెండింగ్‌లో పడింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత మళ్లీ అవిశ్వాసం అంశం తెరపైకి వచ్చింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మెజార్టీ కౌన్సిలర్లు గురువారం మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని కలిసి అవిశ్వాసం అంశంపై చర్చించారు. అవిశ్వాసంపై అధికార కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రస్తుతం మౌనంగా ఉన్నారు. ఏడాది చైర్మన్ పదవి కోసం ఎందుకు ప్రయత్నించాలనే ధోరణిలో ఉన్నారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి వర్గానికి చెందిన చైర్‌పర్సన్ స్వప్నపై అవిశ్వాసాన్ని మహేందర్‌రెడ్డి నెగ్గనిస్తారా? అనేది చర్చనీయంగా మారింది. పార్టీ విప్‌ను జారీచేస్తే చైర్‌పర్సన్ స్వప్న పరిస్థితి ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు, తాండూరు పట్టణంలో 36 వార్డులున్న తాండూరు మున్సిపాలిటీలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీల బలాబలాలు మారాయి. 24మంది కౌన్సిలర్లు ఉన్న బీఆర్ఎస్‌కు ఇప్పుడు 18మంది కౌన్సిలర్లు ఉన్నారు (చైర్‌పర్సన్‌తో కలిపి) ముగ్గురు కౌన్సిలర్లు ఉన్న కాంగ్రెస్ తొమ్మిదికి చేరింది. బీజేపీ ఐదు, ఎంఐఎం మూడు, టీజేఎస్ ఒకరు ఉన్నారు.

గుండ్లపోచంపల్లి మునిసిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారం

మేడ్చల్ టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారం లభించింది. గురువారం ఢిల్లీలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ వి.రాములు కేంద్ర మంత్రులు దీప్‌సింగ్ పూరి, కుషాల్‌కిషోర్‌ల నుంచి పురస్కారాన్ని అందుకున్నారు. పట్టణంలో మెరుగైన పారిశుధ్య సేవలకు గుర్తింపుగా కేంద్రం ప్రభుత్వం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీని ఈ అవార్డుకు ఎంపిక చేసింది. పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి చైర్‌పర్సన్, కమిషనర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం కోసం మునిసిపాలిటీలో చేపట్టిన చర్యలు, ఫలితాలపై చైర్‌పర్సన్, కమిషనర్‌లు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులకు వివరించారు. అలాగే ఓడీఎఫ్ ప్లస్ ర్యాంక్, జీఎఫ్‌సీలో స్టార్ వన్ రేటింగ్‌ను కూడా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ దక్కించుకోవటం విశేషం. ఇదే కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్, సీడీఎంఏ రొనాల్డ్‌రోస్, అడిషనల్ డైరెక్టర్ శ్యాంసన్, డీఈ దుర్గాప్రసాద్, ఈఈ నర్సింహారెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ జిశైలజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ.. తమ మున్సిపాలిటీకి అవార్డు వచ్చేలా సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. పారిశుధ్య చైతన్య కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందగా పాల్గొని పరిసరాలను, ఇళ్లను శుభ్రంగా ఉంచుకున్నారన్నారు. ప్రతీ ఒక్కరి సహకారం వల్లే మునిసిపాలిటీకి పురస్కారం దక్కిందన్నారు. మున్సిపల్ కమిషనర్ రాములు మాట్లాడుతూ.. మునిసిపాలిటీకి స్వచ్ఛ అవార్డు రావడానికి అందరూ శ్రమించారన్నారు. మున్సిపల్ పాలకవర్గం, పారిశుధ్య కార్మికులు, సిబ్బంది కృషికి ఫలితమే సచ్ఛ సర్వేక్షణ్ పురసారం అన్నారు. ప్రజలు కూడా బాధ్యతతో ఇళ్లను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నారన్నారు. అలాగే మన్సిపల్ సిబ్బంది నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొని వారు అండగా నిలిచారన్నారు.

గొల్లచెరువు ఏరియాలో కార్డన్‌సెర్చ్

తాండూరు, జనవరి 11: తాండూరు పట్టణంలోని గొల్లచెరువు ఏరియాలో గురువారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. 110 వాహనాలను తనిఖీ చేసి నెంబర్ ప్లేట్ లేని, సరైన పత్రాలులేని 15బైకులను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ శేఖర్‌గౌడ్ అక్కడి ప్రజలను కలిసి మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టాలని, సైబర్ నేరాల మీద ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వాహనం నడిపేవారు తప్పకుండా హెల్మెట్‌తో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఇతర నేరాలకు పాల్పడితే కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సెర్చ్‌లో సీఐలు రాజేందర్‌రెడ్డి, రాంబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో క్లీనెస్ట్ సిటీగా దమ్మాయిగూడ

- దక్షిణ భారత్ స్థాయిలో రెండో స్థానం

కీసర రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్-2023 అవార్డు ఎంపికలో భాగంగా 15వేల నుంచి 25వేల జనాభా ఉన్న పట్టణాల కేటగిరిలో మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీ దక్షిణ భారతదేశంలో క్లీనెస్ట్ సిటీ జాబితాలో రెండో స్థానంలో నిలిచింది. 25వేల నుంచి 50వేల జనాభా కేటగిరిలో నాగారం మున్సిపాలిటీ సౌత్ ఇండియా లెవల్‌లో పదో స్థానాన్ని సాధించింది. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం అవార్డును ప్రదానం చేసింది. సంబంధిత శాఖల ప్రతినిధులు ఆయా మున్సిపాలిటీల్లో పర్యటించి పరిశీలించి అక్కడి ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని పురస్కారాలకు ఎంపిక చేశారు. దక్షిణ భారత్ స్థాయిలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ గురువారం ఈ ర్యాంక్‌లను వెల్లడించింది. దక్షిణ భారత స్థాయిలో క్లీనెస్ట్ సిటీగా దమ్మాయిగూడ రెండో స్థానాన్ని సాధించటం పట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణిత అనందాన్ని వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన పారిశుధ్య కార్మికులకు, మున్సిపల్ సిబ్బందికి, ప్రజలకు ఈ సందర్భంగా ఆమె ధన్యవాదలు తెలిపారు.

వైభవంగా ఊరడమ్మ జాతర

పెద్దేముల్, జనవరి 11: నాగులపల్లి గ్రామంలో గ్రామదేవత జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్దేముల్ మండలం నాగులపల్లి గ్రామంలో ఊరడమ్మ జాతర సందర్భంగా ఊరంతా బంధువులు, ఆడపడుచులతో నిండిపోయింది. బంధు, మిత్రుల మధ్యన జాతర ఉత్సవాలు గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో బయదేరారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా అమ్మవారి గుడివద్దకు చేరుకుని నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా పోతురాజులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. నైవేద్యాల అనంతరం ఏర్పుల సాని భవిష్యవాణిని వినిపించారు.

మహేశ్వరంలో రూ.150 కోట్ల

ఎస్‌డీఎఫ్ ఫండ్స్ నిలిపివేత

మున్సిపాలిటీల్లో నిలిచిన డ్రైనేజీ, రోడ్లు, ఇతర నిర్మాణ పనులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : జిల్లాలోని మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల అభివృద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) కింద రూ.150 కోట్లు మంజూరు చేసింది. అధికారులు ఆయా అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేసి, శంకుస్థాపనలు కూడా చేశారు. తీరా పనులు ప్రారంభించాల్సిన సమయంలో గతంలో కేటాయించిన నిధులను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జూన్ 19న మహేశ్వరం నియోజకవర్గం తుమ్మలూరులో హరిత హారం కార్యక్రమాన్ని మాజీ సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహేశ్వరం నియోజకవర్గానికి నిధుల వర్షం కురిపించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కోరిక మేరకు మహేశ్వరం నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అభివృద్ధి పనుల కోసం రూ.150 కోట్లు మంజూరు చేశారు. అందులో బడంగ్‌పేట్, మీర్‌పేట్ మున్సిపాలిటీలకు రూ.50 కోట్లు, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.50కోట్లు మంజూరు చేశారు. అలాగే తుక్కుగూడకు రూ.25 కోట్లు, జల్‌పల్లికి రూ.25 కోట్లు మంజూరు చేశారు. ఆ మేరకు పాలనాపరమైన అనుమతి కూడా ఇచ్చారు. సీఎం హామీ మేరకు సంబంధిత అధికారులు మున్సిపాలిటీల్లోని వార్డులు, కాలనీలవారీగా డ్రైనేజీ, రోడ్ల నిర్మాణాలకు అంచనాలు రూపొందించారు. అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా పనులకు శంకుస్థాపనలు కూడా చేయించారు. తీరా పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ఆయా పనులను తాత్కాలికంగా వాయిదా వేయాల్సి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమిపాలై, కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ మంజూరు చేసిన రూ.150 కోట్ల నిధులను రద్దు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గ్రౌండింగ్ దశలో ఉన్న పనులన్నీ నిలిపివేయాల్సిందిగా ఇటీవల కలెక్టర్ ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దాంతో మున్సిపాలిటీల్లో ప్రతిపాదించిన అభివృద్ధి పనుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉండగా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు, మహేశ్వరం, తుక్కుగూడ, బాలపూర్ మండల పరిధిలోని 65 గ్రామ పంచాయతీల్లో కుల సంఘాల భవనాలు నిర్మించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 9.90 కోట్లు మంజూరు చేసింది. కొన్నిచోట్ల సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపనలు చేశారు. కానీ.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు నిలిపి వేసినట్లు తెలిసింది. దాంతో కుల సంఘాల నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

నిధులు నిలిపివేయడం అన్యాయం



గత సీఎం కేసీఆర్‌ను ఒప్పించి నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించాను. ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారు. మున్సిపాలిటీలు, వార్డులవారీగా చేపట్టాల్సిన పనులను గుర్తించి అంచనాలు రూపొందించాం. తీరా పనులు ప్రారంభించే సమయంలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద మంజూరుచేసిన నిధులను నిలిపివేయడం అన్యాయం. ప్రభుత్వ నిర్ణయంతో మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి, తుక్కుగూడ అభివృద్ధికి ఆటంకంగా మారుతోంది. గత ప్రభుత్వం కేటాయించిన నిధులు కేటాయించకపోగా, కొత్తగా ఎమ్మెల్యేకు రూ.10 కోట్ల చొప్పున ఫండ్స్ మంజూరు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. నిలిపివేసిన నిధులను తక్షణమే మంజూరు చేయించాలి.

- సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే మహేశ్వరం

సాగుకు సాంకేతిక సహకారం

- వ్యవసాయ డివిజన్‌ల వారీగా దృశ్య శ్రవణ కేంద్రాల ఏర్పాటు
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మూడు రైతువేదికల ఎంపిక
- ఈనెల 15న ప్రారంభించనున్న కేంద్రాలు
- పరిశీలించిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, జనవరి 11: రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు క్లస్టర్ల వారీగా ఏర్పాటు చేసిన రైతు వేదికలు రైతులకు ఉపయోగపడే దిశగా ప్రభుత్వం యోచనలో ఉంది. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఆధునిక, సాంకేతికతను ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వ్యవసాయ డివిజన్ల వారీగా రైతులకు అందుబాటులో ఉండే రైతు వేదికలను దృశ్యశ్రవణ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 32రైతువేదిక కేంద్రాలను ఎంపిక చేయగా, అందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మూడు రైతువేదికలు ఎంపికయ్యాయి. వికారాబాద్ జిల్లాలోని పూడూరు, మేడ్చల్ జిల్లాలోని ముడిచింతలపల్లి, రంగారెడ్డి జిల్లాలోని మంచ్యాల్ రైతు వేదికలను ఎంపికచేసి ప్రతిపాదనలు పంపించారు. దీంతో ఆయాకేంద్రాల్లో నెట్‌వర్క్ సౌకర్యం, వసతులు సమకూర్చేపనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. మొదటి విడతలో ఒక కేంద్రాన్ని గుర్తించి ఈనెల 15న ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గురువారం పూడూరులోని రైతు వేదికను సందర్శించి అక్కడి పరికరాలను పరిశీలించారు. మండల ఏవో తులసీరాం రైతువేదికలోని దృశ్య శ్రవణ పరికరాలపై ఎమ్మెల్యేకు వివరించారు. ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వం క్లస్టర్ల వారీగా రూ.20లక్షల వ్యయంతో రైతు వేదికల భవనాలను నిర్మించింది. అవసరమైన సౌకర్యాలను సమకూర్చడంతో వాటిని వినియోగంలోకి తీసుకొచ్చారు. తర్వాత నిర్వహణ ఖర్చులు ఇవ్వకపోవడం, రైతులకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయకపోవడంతో అవి నిరుపయోగమయ్యాయి. రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు వీలుగా వీటిని తీర్చిదిద్దాలని ప్రభుత్వం ఆదేశించడంతో వ్యవసాయ డివిజన్ల వారీగా ఒక రైతు వేదికను దృశ్య శ్రవణ కేంద్రంగా మార్చనున్నారు. ఇందులో భాగంగా అంతర్జాల సౌకర్యం అందుబాటులో ఉండటంతోపాటు రైతులు వచ్చేందుకు వీలుగా రోడ్డు, ఇతర సౌకర్యాలు ఉన్న రైతు వేదికలను ఎంపిక చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిపాదనలు పంపించారు.


రైతువేదికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి దృశ్యశ్రవణంపై వివరిస్తున్న ఏవో


రైతులకు మేలు



రైతు వేదికలను దృశ్య శ్రవణ కేంద్రాలుగా మార్చడంతో రైతులకు మేలు జరుగుతుంది. వ్యవసాయ సంబంధిత సమాచారంతోపాటు పంటల వారీగా నేరుగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల నుంచి సలహాలు, సూచనలు పొందే వీలుంది. ఎప్పటికప్పుడు ఆధునిక పరిజ్ఞానం రైతులకు చేరవేయడానికి అవకాశం ఉంది. గ్రామాల వారీగా ఆసక్తి ఉన్న రైతులను సమావేశ పరిచి నేరుగా కొన్ని విషయాలను తెలియజేయడంతోపాటు దృశ్య శ్రవణ పద్ధతిలో కొన్ని విషయాలను తెలుసుకునే అవకాశం ఉంది.

- గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

దృశ్య శ్రవణ పద్ధతి రైతులకు ఉపయోగకరం



రైతు వేదికల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న దృశ్య, శ్రవణ పద్ధతి రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఎలాంటి సందేహాలున్నా రైతులు ఈ పద్ధతి ద్వారా సులువుగా అర్థం చేసుకునేందుకు వీలుంటుంది. ఆధునిక వ్యవసాయంపై వారికి అవగాహన పెరుగుతుంది. ఎప్పటికప్పుడు వ్యవసాయ యంత్రాల్లో వస్తున్న మార్పులు, వ్యవసాయ విషయాలు తెలుసుకునేందుకు చాలా ఉపయోగపడుతుంది.

- ఎం.తులసీరాం, ఏవో, పూడూరు

పండుగలు సంస్కృతికి చిహ్నాలు



మేడ్చల్ టౌన్: సంక్రాంతి సంబురాల్లో విద్యార్థులు



పరిగిలోని శిశుమందిర్‌లో పతంగులతో విద్యార్థులు



తాండూరు: కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సంబురాలు

మేడ్చల్ టౌన్, జనవరి 11: పండుగలు సంస్కృతికి చిహ్నాలని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి జె.త్రిశూల్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులు ముందస్తు సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలుగువారి సంస్కృతిని చాటే పండుగల్లో సంక్రాంతి పండుగకు ప్రత్యేకస్థానం ఉందన్నారు. వేడుకల్లో భాగంగా కళాశాల విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేశారు. పిండి వంటలు చేసి తీసుకొచ్చారు. యువతులు సంక్రాంతి పాటలపై ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జె.నర్సింహారెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లోకనాథం, డీన్, టీ.ఎల్. రామదాసు, కన్వీనర్ శైలజరెడ్డి పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: సంక్రాంతికి ముందే కాలనీల్లో పండుగ వాతావరణం నెలకొందని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను ఆయన ప్రారంభించారు. శిరీష మొదటి గెలుపొందింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మి, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, మురళి, ప్రశాంత్, శ్రీధర్, శివ, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: కొర్రెముల, బాలాజీనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో గురువారం ముగ్గుల పోటీలతో పాటు పతంగుల పోటీలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ శ్రీలతరమేష్‌బాబు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బ్రహ్మచారి, వైఎస్ ప్రిన్సిపల్ మెట్టు వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి తన వార్డులో గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతకు బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, లావణ్య, రాజ్ శ్రీనివాస్, స్థానికులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: కరన్‌కోట్ ప్రాథమిక పాఠశాలలో గాలిపాటలతో విద్యార్థులు

కొడంగల్ రూరల్: దుద్యాల మండలం ఆలేడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సిద్ధుమల్లేశ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

తాండూరు: గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ సంగీత ఠాకూర్ పాఠశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు గాలిపటాల పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు నువ్వుల లడ్డూలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని సాయిపూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ విష్ణువరకదన్‌రెడ్డి, కరస్పాండెంట్ నరోత్తమ్‌రెడ్డి, ఇన్‌చార్జి జైవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ రమేష్ పాల్గొన్నారు.

పరిగి: పరిగిలోని శ్రీసరస్వతీశిశుమందిర్, సుదీక్ష స్కూల్‌లలో సంబురాలు నిర్వహించారు.ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులచే పతంగులను ఎగురవేయించారు. గొబ్బెమ్మలు తయారు చేశారు.

తాండూరు రూరల్: మండలంలోని కరన్‌కోట్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గురువారం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. నేటి(శుక్రవారం) నుంచి సెలవులు కావడంతో ముందురోజు పండుగను జరుపుకున్నారు. విద్యార్థులు భోగిమంటలు వేశారు. గాలిపటాలు ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు.

పూడూరు: మేడిపల్లికలాన్ ప్రాథకోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు సంక్రాంతి సంబురాలు నిర్వహించుకున్నారు. పాఠశాల చైర్మన్ రవి ఆధ్వర్యంలో విద్యార్థినీలు రంగురంగుల ముగ్గులు వేయగా, బాలురు గాలిపటాలు ఎగురవేసి సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఖాజామైనుద్దీన్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గురువారం దుద్యాల మండల కేంద్రంలోని నేతాజీ విద్యానికేతన్ పాఠశాల, బొంరాస్‌పేట్ రెయిన్‌బో పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుద్యాల తహసీల్దార్ దానయ్య, జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నెహ్రూ చౌహన్ మాట్లాడుతూ ముగ్గులు విద్యార్థుల్లో ఉండే ప్రతిభను వెలికితీస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి.రాఘవేందర్‌యాదవ్, ఉపాధ్యాయులు శ్వేత, రఘు, శ్రీనివాస్, అన్వర్, జయశ్రీ, సాగరిక, హైమద్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జిల్లా జెండర్ స్పెషలిస్టు వాసవి

శామీర్‌పేట, జనవరి 11: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా జండర్ స్పెషలిస్టు వాసవి అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని పోతాయిపల్లిలో గురువారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో 'మహిళా సాధికారత' అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. మహిళలు ఎంచుకున్న రంగాల్లో లక్ష్యాన్ని చేరుకోవడానికి సతహాగా నిర్ణయాలు తీసుకొని స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'వెంచర్ చుట్టూ గోడలను తొలగించాలి'

మేడ్చల్ టౌన్, జనవరి 11: గౌడవెల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 439లోని ముకుట డెవలపర్స్ వారు వెంచర్ చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారని ఉపసర్పంచ్ పెంటమ్మ గురువారం వార్డుసభ్యులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ అనుమతితో ఏర్పాటు చేసిన వెంచర్ రోడ్లను ఇతరులు వినియోగించుకోకుండా చేశారని తెలిపారు. గోడలను వెంటనే తొలగించాలని వారు కోరారు.

పనిచేయని అధికారులు స్వచ్ఛందంగా వెళ్లిపోవచ్చు

పూడూరు, జనవరి 11: పనిచేయని అధికారులు స్వచ్ఛందంగా రాజీనామా చేసి వెళ్లిపోవచ్చని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను రైతు వేదికలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్ల రూపాయలు అభివృద్ధి కోసం ప్రభుత్వం త్వరలో అందించబోతుందన్నారు. మొత్తం 64 చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీడీవో ఉమాదేవి ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అందుకు సంబంధించిన వీడియో రికార్డులు సైతం తమ వద్దకు వచ్చాయన్నారు. ఇష్టం లేకపోతే రాజీనామా చేసి వెళ్లిపోవచ్చని ఎమ్మెల్యే సూచించారు. పనిచేసే అధికారులకే ప్రభుత్వంలో పని చేయాలని, లేకపోతే స్వచ్ఛందంగా తప్పుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జడ్పీటీసీ మేఘమాల, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, రఘునాథ్ రెడ్డి, షఖీల్, పెంటయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పూడూరులోని రైతు వేదికలో కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 68మందికి పంపిణీ చేశారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పీఆర్‌టీయూ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, తహసీల్దార్ పురుషోత్తం, ఎంఈవో హరిచందర్, ఎంపీటీసీలు అనిత, విజయ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పరిగి/కులకచర్ల/పూడూరు: పాంబండ దేవాలయం ఆవరణలో పీఆర్‌టీయూ నూతన సంవత్సరం క్యాలండర్‌ను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బస్వరాజ్, మండల విద్యాధికారి హబీబ్‌అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, రాష్ట్ర బాధ్యులు పరందాములు, పెంటయ్య, వెంకటేశ్, నర్సింహులు, సతీశ్, వెంకటయ్య, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా, మండలకార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. అదేవిధంగా కేజీబీవీలోని సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపాల్ దేవి వినతిపత్రం అందించారు. అదేవిధంగా పూడూరు విద్యావనరుల కేంద్రంలో పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

ఆన్‌లైన్ నమోదును వేగవంతం చేయాలి

కీసర రూరల్, జనవరి 11: అభయ హస్తం దరఖాస్తు దారుల వివవరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య దమ్మాయిగూడ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం నాగారం మున్సిపాలిటీలోని కేజీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ నమోదు సెంటర్‌ను ఆయన సందర్శించారు. యూపీహెచ్‌ఎస్ కొరకు స్థలం కేటాయించాలని, సీనియర్ సిటిజన్ రీడింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్ ఎలిజాల నగేష్ పాల్గొన్నారు.



పెద్దేముల్: దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తున్న సిబ్బంది

పెద్దేముల్: మండలంలో ఆరుగ్యారంటీల దరఖాస్తుల అప్‌లోడింగ్ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. అధికారులు మండల తహసీల్దారు కార్యాలయం, మండల విద్యావనరుల కేంద్రం, మండల పరిషత్ కార్యాలయం తదితర కార్యాలయాల్లో కంప్యూటర్, ల్యాప్‌ట్యాప్‌లు 30కి పైగా ఉపయోగించి దరఖాస్తులు అప్‌లోడు చేస్తున్నారు. ప్రభుత్వం తమకు ఈనెల 17వరకు అప్‌లోడ్ చేయాలని గడువు ఇచ్చినా అంతలోపే పూర్తిచేస్తామని తహశీల్దారు కిషన్, ఎంపీడీవో లక్ష్మప్ప తెలిపారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని గ్రంథాలయాన్ని అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన నిర్మాణంలో ఉన్న గ్రంథాలయాన్ని పరిశీలించి, మున్సిపల్ కమిషనర్ సాబెర్ అలీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

నవాబుపేట, జనవరి 11: మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరయ్యారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తుండడంతో తమ చివరి నివేదికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుమిత్రమ్మ, తహసీల్దార్ జయ రాం, వైస్ ఎంపీపీ బందెయ్యగౌడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. కాగా, వైస్ ఎంపీపీ బందెయ్యగౌడ్ ఎంపీటీసీ పదవీకి, బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సర్వసభ్య సమావేశంలో తెలిపారు. పదవీతో పాటు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి సజావుగా గ్యాస్ డెలివరీ

వికారాబాద్, జనవరి 11: వికారాబాద్ పట్టణంలో రెండురోజులుగా గ్యాస్ కొరత ఉందని స్థానిక అంబికగ్యాస్ ఏజెన్సీ వద్ద వినియోగదారులు క్యూ కడుతున్నారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ సేల్స్ అధికారితో మాట్లాడారు. రేపటి(శనివారం) నుంచి ఇబ్బందులు లేకుండా గ్యాస్ డెలివరీని సజావుగా కొనసాగించేలా చూడాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ప్రజలు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు.

అసెంబ్లీ స్పీకర్‌కు సన్మానం



మోమిన్‌పేట్: ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

మోమిన్‌పేట్, జనవరి 11: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను జడ్పీ వైస్ చైర్మన్ బి.విజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, మోమిన్‌పేట్ మండల ఎంపీపీ డి.వసంతవెంకట్ సన్మానించారు. మర్పల్లి మండల కేంద్రంలో వారు స్పీకర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మర్పల్లి ఎంపీపీ భట్టు లలిత పాల్గొన్నారు.

తాండూరు రూరల్: తాండూరు మండలం ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీరందర్‌గౌడ్, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్‌లు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం వికారాబాద్ జిల్లా పరిషత్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి తమ తాండూరు ప్రాంతానికి అధిక నిధులు కేటాయించేందుకు కృషి చేయాలని కోరారు.

జన్మదిన వేడుకలకు హాజరైన అసెంబ్లీ స్పీకర్

మర్పల్లి: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి సోదరుడు పీఏసీఎస్ చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి కుమారుడు శివరాంరెడ్డి మొదటి జన్మదిన వేడుకలకు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు పట్లోళ్ల మహిపాల్‌రెడ్డి, రమేశ్, సుధాకర్ రెడ్డి, రాములుయాదవ్, సుభాష్‌యాదవ్, రామేశ్వర్, సురేశ్, నాగేశ్, వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **వికారాబాద్:** మిరపలో పూతను ఆశించే కొత్త రకం తామరపురుగుల సమగ్ర యాజమాన్యం పద్ధతులు పాటించాలని ఉద్యానశాఖ అధికారి చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు.

● **మర్పల్లి:** ప్రతీ కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పంచలింగాల గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ తండ్రి గత నెల 28న అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో స్పీకర్ గురువారం గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ ఉన్నారు.

● **కొడంగల్:** వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అఖిల పక్షం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇమేజ్ ఎలక్ట్రోరల్ రోల్స్ ప్రత్యేక సారాంశం సవరణపై వివరించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ తహసీల్దార్ బి.విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినిలకు మాజీ ఎమ్మెల్యే కోడలు ఎం.నవ్యశ్రీరోహిత్‌మహరాజ్ గురువారం నగదు బహుమతులను అందజేశారు. బషీరాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలికాలు)లో గత సంవత్సరం నిర్వహించిన పది పరీక్షలో ప్రథమంగా నిలిచిన ముగ్గురు బాలికలకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3,500, మూడో బహుమతి రూ.1500 అందజేసి అభినందించారు

● **కొడంగల్:** ఆల్‌ఇండియా విశ్వకర్మ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహాదేవ శివాలయం ఆవరణలోకొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేందర్‌చారి, అధికార ప్రతినిధి రవీంద్రచారి, నియోజకవర్గ అధ్యక్షుడు బ్రహ్మయ్యచారి ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా దశరథ్‌చారి, ప్రధాన కార్యదర్శిగా నారాయణచారి, కోషాధికారిగా శ్రీనివాస్‌చారి, ఉపాధ్యక్షుడిగా మల్లేశంచారి, సహాయ కార్యదర్శిగా వేణుగోపాల్‌చారిలను ఎన్నుకున్నారు.

● **తాండూరు రూరల్:** సంక్రాంతి పండుగకు ఊరెళ్లే వారి తాండూరు మండలం కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదనరెడ్డి పలు సూచనలు చేశారు. మండలంలోని వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ప్రజలు పండుగకు ఊరికి వెళితే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

● **పరిగి:** పరిగి పట్టణ విశ్వకర్మ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నయ్యచారి, ఉపాధ్యక్షులుగా రవిచారి, రమేశ్‌చారి, కార్యదర్శులుగా రామలింగంచారి, వినోద్‌చారి, కోశాధికారులుగా బ్రహ్మచారి, షణ్ముఖచారి, సలహాదారులు నవీన్‌చారి, రఘుచారి, రాజేశ్‌చారిలు ఎన్నికయ్యారు.

● **కొడంగల్:** ఓటర్లుగా నమోదు చేసుకొని వారు 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. గురువారం కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదుకు ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

● **ధారూరు:** గుండెపోటుతో యూత్ కాంగ్రెస్ కార్యకర్త మృతి చెందాడు. కేరెల్లి గ్రామానికి చెందిన బేగరి సురేష్ (32)కు గురువారం ఉదయం గుండెపోటు రాగా మెరుగైన చికిత్సనిమిత్తం కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** వెంకటాపూర్‌లో గురువారం వికసిత్‌భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅథితిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణారెడ్డి, ఎంపీటీసీ నీరుడి రామారావు, ఉపసర్పంచ్ సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

● **మర్పల్లి:** అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే బీఆర్‌ఎస్ విమర్శలు చేయడమేంటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల రోజులకే బీఆర్‌ఎస్ నాయకులు దళిత సోదరులను రెచ్చగొట్టి కలెక్టరేట్‌ల ముందు ధర్నా చేయించడం సరికాదన్నారు.

● **ఘట్‌కేసర్:** 33/11కేవీ సంస్కృతి టౌన్‌షిప్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు(శుక్రవారం) విద్యుత్ సరఫరాను నలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు.

● **కొడంగల్/తాండూరు/ధారూరు:** స్వామివివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ కాన్వెంట్ పాఠశాలలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అదేవిధంగా తాండూరులో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ విశ్వ వేద పాఠశాలలో ప్రసంగించారు.విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదేవిధంగా ధారూరు మండలంలోని తరిగోపుల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి యువకుడు మృతి

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

మేడ్చల్ టౌన్, జనవరి 11: అనుమానాస్పద స్థితిలో రైలుకింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ మండలం డబీల్‌పూర్ గ్రామ శివార్లలో చోటుచేసుకుంది. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కూచారం గ్రామ జైతురాం తండాకు చెందిన మలావత్ అనీల్ అనే యుకుడు మంగళవారం రాత్రి తన ఇంట్లో గొడవ పడి ఇంటి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం తెల్లవారుజామున డబీల్‌పూర్ గ్రామ శివార్లలోని రైలుపట్టాల వద్ద గుర్తు పట్టని విధంగా శవమై కనిపించాడు. దీంతో స్థానికులు రైల్వేపోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు శవపరీక్ష నిర్వహించి మృతుడు మలావత్ అనీల్‌గా నిర్ధారించారు. మృతదేహాన్ని గురువారం కుంటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన వ్యక్తి.. కుటుంబసభ్యులకు అప్పగింత

పరిగి, జనవరి 11: ఇటీవల పరిగిలో జరిగిన ఇస్తేమా సభలకు వచ్చి అదృశ్యమైన వ్యక్తిని పరిగి పోలీసులు గురువారం కుటుంబసభ్యులకు అప్పగించారు. జగిత్యాల జిల్లా రాయికల్ గ్రామానికి చెందిన దస్తగిరి అనే వ్యక్తి పరిగికి వచ్చి సోమవారం తప్పిపోయాడు. బుధవారం రాత్రి పరిగిలోని తిరుమల వెంచర్ సమీపంలోని మాణిక్యం ఇంటి వద్ద మతి స్థిమితం లేకుండా ప్రవర్తించడంతో అతడు కాంగ్రెస్ కార్యకర్త నాగవర్ధన్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా ఎస్‌ఐ సత్యనారాయణ వివరాలను ఆరా తీసి జగిత్యాలలో ఉంటున్న కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం దస్తగిరిని కుటుంబసభ్యులకు అప్పగించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి

కొడంగల్/బొంరాస్‌పేట్/దౌల్తాబాద్, జనవరి 11: కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని పలువురు అనారోగ్యం బారిన పడి ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధిత కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. హైదరాబాద్‌లో గురువారం దుద్యాల మండలం ఈర్లపల్లి గ్రామానికి చెందిన విఠల్‌కు రూ.3లక్షలు, బొంరాస్‌పేట్ మండలం ఏర్పుమళ్ల గ్రామానికి చెందిన హరీశ్‌గౌడ్‌కు రూ.3లక్షలు, దౌల్తాబాద్ మండలం బాలంపేట గ్రామానికి చెందిన రాములుకు రూ.లక్ష, చంద్రకల్‌కు చెందిన కె.సాయికుమార్‌కు రూ.3లక్షలు, దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన కృష్ణలీలకు రూ.3లక్షలు, మద్దూర్ పట్టణానికి చెందిన మహిపాల్‌గౌడ్‌కు రూ.5లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బొంరాస్‌పేట మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పట్టణంలో హెల్త్ వాక్ ర్యాలీ



వికారాబాద్ పట్టణంలో హెల్త్ వాక్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వికారాబాద్, జనవరి 11: జాతీయ యువజన దినోత్సవాల్లో భాగంగా వికారాబాద్ పట్టణంలోని యజ్ఞ ఫౌండేషన్ వారి స్వామి వివేకానంద గురుకుల్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్‌లో గురువారం హెల్త్ వాక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సినిమ్యాక్స్ థియేటర్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు హెల్త్ వాక్ ర్యాలీ నిర్వహించారు. యజ్ఞా ఫౌండేషన్ నిర్వాహకులు యుజ్వల్ రాజ్ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవన శైలి, ఆహారం, వ్యాయామం చేయాలని సూచించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 11: సైబర్ నేరాల పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఘట్‌కేసర్ సీఐ మద్ది మహేందర్‌రెడ్డి తెలిపారు. అవుషాపూర్‌లోని విజ్ఞానభారతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సైబర్‌నేరాలు, యాంటీర్యాగింగ్, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైటెక్ ల్యాబ్ సీఈవో సందీప్, ఎస్‌ఐలు అశోక్, శ్రీకాంత్, వీబీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ శ్రీనివాస్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూలంగి సేవ

కొడంగల్, జనవరి 11: అమావాస్య సందర్భంగా కొడంగల్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామికి గురువారం ఆలయ అర్చకులు వివిధ రకాల పూలతో పూలంగి సేవ నిర్వహించారు. ప్రతీ అమావాస్య రోజున స్వామి వారికి విశేషంగా పూలంగిసేవ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

బంట్వారం మండల వీఏవోల నూతన కమిటీ

బంట్వారం జనవరి 11: వీఏవో సమస్యల పరిష్కారానికి నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నట్లు నూతన కమిటీ అధ్యక్షుడు వీరేశం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామన్నారు. తమ సమస్యల పరిష్కారానికి నూతన కమిటీలను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.. ఉపాధ్యక్షురాలిగా జయమ్మ, ప్రధాన కార్యదర్శిగా మొల్లప్ప, సహాయ కార్యదర్శిగా సునంద, కోశాధికారిగా సుభాష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రవీన్, సలహాదారులుగా మచ్చేందర్, మహేందర్, లాలయ్య, నరేందర్, సోషల్ మీడియా ఆశిరెడ్డిలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమాస పండుగ

కొడంగల్ రూరల్, జనవరి 11: ఎల్లమాస పండుగను కొడంగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని టేకుల్‌కోడ్, అన్నారం, రుద్రారం తదితర గ్రామాల్లో గురువారం రైతులు జొన్నపొలాల్లో పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. నిర్వహించారు. పొలం మధ్యలో జొన్న మొక్కల దగ్గర నైవేద్యాలు ఉంచి పంటల దిగుబడి బాగా రావాలని మొక్కుకున్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్/తాండూరు రూరల్/కీసర, జనవరి 11: జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 2024 -25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఏప్రిల్ 1, 2024 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించిన ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 7న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతి నుంచి 10వ తరగతి అప్లయి చేసుకున్న వారికి ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఐనెల్లిలోని తెలంగాణ మోడల్‌స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు ఈనెల 12వ తేదీ నుంచి ఫిబ్రవరి 22వరకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ వై.ప్రకాష్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా అంకిరెడ్డిపల్లిలోని గురుకుల పాఠశాల హెచ్‌ఎం రాజమణి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులల్లో 5వ తరగతి ప్రవేశాలకు ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, ఫిబ్రవరి11న రాత పరీక్ష నిర్వహించి మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

కీసర, జనవరి 11: నాలుగు నెలలుగా జీతాలు లేకపోవడంతో పారిశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు గురువారం భిక్షాటన చేస్తూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌ను వివరణ అడుగగా ఇరవై రోజుల కిందట చెక్కు డిపాజిట్ చేయడం జరిగిందని, నగదు రాగానే కార్మికులకు వేతనాలు అందజేస్తామని తెలిపారు. ఈ విషయమై సర్పంచ్ రాజు కార్మికులతో చర్చించి భిక్షాటనను విరమింపచేశారు.